## కేంద్రమంత్రిగా ఏం చేశావ్ కిషన్ రెడ్డి

### మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



మంత్రి తలసాని సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన సనత్‌నగర్ బీజేపీ నాయకులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 1: నాలుగున్నర ఏండ్లుగా కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి.. గెలిపించిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆదివారం మంత్రి నివాసంలో బీజేపీ హైదరాబాద్ జిల్లా ఎస్సీ మోర్చా నగర ప్రధాన కార్యదర్శి అంగముత్తు శ్రీనివాస్, సికింద్రాబాద్ మజ్దూర్ మోర్చా కన్వీనర్ ఎక్కాల శ్రీనివాస్, సికింద్రాబాద్ ఎస్సీ మోర్చా కన్వీనర్ నాగులపల్లి మల్లేశ్, సికింద్రాబాద్ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్, బన్సీలాల్‌పేట్ డివిజన్ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు దీపక్, కార్యదర్శి గణేశ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ తెలంగాణలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తలసాని రవీందర్ యాదవ్ (స్కైలాబ్), బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, ఎం.సురేశ్, గజ్జెలశ్రీను, వినోద్, ఎల్.సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

## వైశ్యుల డిమాండ్లు సీఎం దృష్టికి తీసుకెళ్తా

### వైశ్యగర్జన సభలో ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



వైశ్యగర్జన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఆర్కేపురం, అక్టోబర్ 1 : వైశ్యుల న్యాయమైన డిమాండ్లను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి వారికి అండగా ఉంటానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వైశ్య వికాస వేదిక చైర్మన్ కాచం సత్యనారాయణగుప్తా ఆధ్వర్యంలో వైశ్యుల ఆత్మగౌరవం–హక్కుల సాధనకై ఏర్పాటు చేసిన వైశ్య గర్జన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ఒక్కసారి మాట ఇస్తే వందశాతం అమలు చేస్తారని, వైశ్యుల అభివృద్ధికి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని వైశ్యుల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమానికి ఎంతో మంది వైశ్యులు అండగా నిలిచారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో ఇప్పటికే వైశ్యులకు 11 కేటాయించామని, ఇంకా మరికొన్నింటిని కేటాయిస్తామన్నారు. రాజకీయంగా కూడా వైశ్యులకు ఎల్బీనగర్‌లో అవకాశం కల్పిస్తామన్నారు.




### పాస్‌పోర్ట్ కార్యాలయంలో స్వచ్ఛతాహీ సేవా..

ఏక్ తారీఖ్.. ఏక్ గంటా కార్యక్రమంలో భాగంగా ఆదివారం హైదరాబాద్‌లోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ దాసరి బాలయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, విద్యార్థులు, పౌరులు పాల్గొని పరిసరాలను పరిశుభ్రపరిచారు. – జూబ్లీహిల్స్, అక్టోబర్ 1



మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో ఈనెల 7న జరుగనున్న హైలైఫ్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన కరపత్రాలను సినీనటి చాందిని, మిస్ ఇండియా తెలంగాణ – 2023 ఊర్మిళాచౌహాన్, ప్రముఖ మోడల్స్‌తో కలిసి నిర్వాహకుడు డొమినిక్ ఆవిష్కరించారు. అనంతరం మోడళ్లు సందడి చేశారు. –మాదాపూర్, అక్టోబర్ 1

# దేశంలో మొదటిది.. ప్రపంచంలో రెండోది

- ఓఆర్ఆర్ సోలార్ రూఫ్‌టాప్ సైకిల్ ట్రాక్‌ను ప్రారంభించిన మంత్రి కేటీఆర్
- హెల్త్‌వే- ఇండియాస్ మొట్టమొదటి సోలార్ సైక్లింగ్ ట్రాక్‌గా పేరు
- ఏడాది పొడవునా 24/7 సైకిల్ ట్రాక్ ఓపెన్
- హైదరాబాద్ కేంద్రంగా సైక్లింగ్ పోటీలు
- గండిపేట చుట్టూ 46 కి.మీ సైకిల్ ట్రాక్
- వెల్లడించిన మంత్రి కేటీఆర్



నార్సింగిలో ఓఆర్ఆర్ వెంబడి నిర్మించిన సోలార్ రూఫ్‌టాప్ సైకిల్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తదితరులు

సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో సైకిల్ ట్రాక్‌లు ఉన్నా, హైదరాబాద్‌లో నిర్మించిన సైకిల్ ట్రాక్ రూపకల్పన ఎంతో ప్రత్యేకమైందని, దేశంలోనే మొదటిది కాగా.. ప్రపంచంలో రెండోదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖల మంత్రి కేటీ.రామారావు అన్నారు. ఆదివారం రాత్రి నార్సింగిలో ఔటర్‌రింగు రోడ్డు వెంబడి 23కి.మీ మేర రెండు మార్గాల్లో నిర్మించిన సోలార్ రూఫ్‌టాప్ సైకిల్ ట్రాక్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... హైదరాబాద్ సైక్లింగ్ ట్రాక్ గత ఏడాది ఆగస్టులో సౌత్ కొరియాలో ఉన్న సోలార్ కవర్ సైకిల్ ట్రాక్‌పై ఒక ట్వీట్‌తో ప్రారంభమైందని, ఏడాది కాల వ్యవధిలోనే 23 కి.మీ దూరం ఉన్న సోలార్ రూఫ్‌టాప్ సైకిల్ ట్రాక్‌ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిర్మించిందన్నారు. ప్రపంచంలో దక్షిణ కొరియా తర్వాత హైదరాబాద్‌లో రెండో సోలార్ రూఫ్‌టాప్ సైకిల్ ట్రాక్ ఉందని, ఇలాంటివి ఇప్పుడు దుబాయ్, స్విట్జర్లాండ్‌లో కూడా నిర్మాణంలో ఉన్నాయన్నారు. దేశంలో ఈ రకమైనది ఇది ఒక్కటే ఉందన్నారు. ఔటర్ రింగు రోడ్డు వెంబడి నిర్మించిన ట్రాక్‌లలో ట్రాక్‌కు ఇరువైపులా రక్షణ, భద్రత ఏర్పాట్లు చేశారని, దీంతో సైకిలిస్టులకు పూర్తిగా సురక్షితమైందని మంత్రి పేర్కొన్నారు.

### 24గంటల పాటు ఓపెన్‌గా..

ఐటీ కారిడార్‌లోని ఓఆర్ఆర్ వెంబడి నిర్మించిన సైకిల్ ట్రాక్ ఏడాది పొడవునా 24/7 తెరిచే ఉంటుందని, రాత్రి వేళల్లో పూర్తి స్థాయిలో విద్యుత్ దీపాలు వెలిగేలా ఏర్పాట్లు చేశామని మంత్రి వెల్లడించారు. సుమారు 16 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేలా ప్యానల్స్ సైకిల్ ట్రాక్ పైభాగంలో బిగించారని, ఇందులో 16వేల సౌర పలకలను కేవలం 18 రోజుల్లోనే బిగించారన్నారు. ట్రాక్ వెంట సీసీటీవీలు, సైబరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉంటుందని, త్వరలో సైకిళ్లను అద్దెకిచ్చే ఏజెన్సీలు వస్తాయన్నారు. ఇవే కాకుండా సైకిల్ ట్రాక్ వెంబడి ఆరోగ్యకరమైన పదార్థాలు, రిటైల్ కియోస్కులు, స్కేటింగ్ రింగ్, టెన్నిస్ కోర్టులు, బ్యాడ్మింటన్ కోర్టులు, స్పోర్టింగ్ రిటైల్ షాపులను ఏర్పాటు చేస్తామన్నారు. సైకిల్ ట్రాక్ నిర్వహణను టెండర్లలో భాగంగా 5 ఏండ్లపాటు నిర్వహించేలా కేఎంవీ ప్రాజెక్టుకే ఇచ్చామని, ఈ సంస్థ అన్ని కార్యకలాపాలు చేపడుతుందన్నారు. మొత్తంలో దేశంలోనే ఒక రకమైన క్రీడా కేంద్రంగా దీన్ని తీర్చిదిద్దుతామని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 6 ఏండ్లలోనే దీనికోసం పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందని, అదేవిధంగా మొత్తం 23 కి.మీ మేర నిర్మించిన ప్రాజెక్టు ద్వారా 14–15 ఏండ్లలోనే పెట్టిన పెట్టుబడి అంతా తిరిగి వచ్చేలా దీన్ని చేపట్టామని మంత్రి పేర్కొన్నారు.

### గండిపేట చుట్టూ 46 కి.మీ సైకిల్ ట్రాక్

ప్రస్తుతం ఐటీ కారిడార్‌లో నిర్మించిన 23 కి.మీ సైకిల్ ట్రాక్‌తోనే సరిపెట్టమని, దీనికి పొడిగింపుగా కోకాపేట నియో పోలీస్ లేఅవుట్, ఫైనాన్సియల్ డిస్ట్రిక్, బుద్వేల్ ఐటీ పార్కుల్లో ప్రత్యేకంగా సైకిల్ ట్రాక్‌లను నిర్మించాలన్న ప్రతిపాదన ఉందన్నారు. అదేవిధంగా ఇక్కడికి సమీపంలోనే ఉన్న గండిపేట చెరువు చుట్టూ 46 కి.మీ పొడవునా సైకిల్ ట్రాక్‌ను నిర్మించాలన్నది తన కల అని, ఇప్పటికే దాన్ని చేపట్టాలని నిర్ణయించామని, త్వరలోనే ఆ ప్రాజెక్టును చేపడుతామని మంత్రి చెప్పారు. అంతటితో ఊరుకోకుండా హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ సైక్లింగ్ పోటీలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇది ఆరంభం మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులు హైదరాబాద్ కేంద్రంగా చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పి.మహేందర్ రెడ్డి, పార్లమెంటు సభ్యులు జి.రంజిత్ రెడ్డి, ఎమ్మెల్సీ కె.నవీన్‌కుమార్, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్ అనితాహరినాథ్ రెడ్డి, నార్సింగి మున్సిపల్ చైర్మన్ రేఖా యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేశ్ యాదవ్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రా మహేందర్ గౌడ్, ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, మెట్రోపాలిటన్ కమిషనర్ అర్విందకుమార్, అర్బన్ ఫారెస్ట్ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రభాకర్, హెచ్‌జీసీఎల్ పూర్వ ఎం.డి బీ.ఎం.సంతోష్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ సీజీఎం రవీందర్, హైదరాబాద్ సైక్లింగ్ గ్రూపు ప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### లఘు చిత్ర ప్రదర్శన....

సోలార్ రూఫ్‌టాప్ సైకిల్ ట్రాక్ ప్రారంభం సందర్భంగా నార్సింగి మై హోం అవతార్ జంక్షన్‌లో హైదరాబాద్ అభివృద్ధిపై రూపొందించిన లఘు చిత్ర ప్రదర్శన చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, హైదరాబాద్ మహానగరం అభివృద్ధి చెందిన తీరు, ప్రభుత్వం నగరంలో కల్పించిన మౌలిక వసతులపై ఈ లఘుచిత్రాన్ని రూపొందించారు.

### నగరంలో 10వేల మంది సైక్లిస్టులు

సైక్లింగ్ పట్ల నగర వాసుల్లో ఎంతో ఆసక్తి ఉన్నది. అందుకు నిదర్శనమే నగరంలోనే 10వేల మంది సైకిలిస్టులు ఉన్నారు. వీరిలో చాలా మంది రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన స్లైకింగ్ ట్రాక్‌ను వినియోగించుకునే అవకాశం ఉన్నది. వీరితోపాటు కొత్తగా మరింత మంది సైక్లింగ్ చేసేందుకు ఆసక్తిని చూపే అవకాశం ఉన్నది. సైకిల్ ట్రాక్ పొడవునా కల్పించిన మౌలిక వసతులు ఎంతో అద్భుతంగా ఉన్నాయంటూ పలువురు సైకిలిస్టు ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను వెల్లడించారు.

# మా మద్దతు మీకే..

- బీఆర్ఎస్ అభ్యర్థులకు నీరాజనం
- భారీ మెజార్టీతో గెలిపించుకుంటామంటూ ఏకగ్రీవ తీర్మానాలు
- ఎమ్మెల్యేలకు స్వచ్ఛందంగా మద్దతు

సిటీబ్యూరో, అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ) : దళితులు.. యాదవులు.. విశ్వబ్రాహ్మణులు, పద్మశాలీలు, రజకులు, ముస్లింలు, మహిళా సంఘాలు, కాలనీ సంఘాలు.. ఇలా ఒక్క కులమని లేదు..మతమని లేదు.. సబ్బండ వర్ణాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు స్వచ్ఛందంగా మద్దతు పలుకుతున్నారు. పదేండ్లలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేరాఫ్‌గా నిలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అండగా ఉంటామని తేల్చి చెబుతున్నారు. గులాబీ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు జనం నీరాజనం పలుకుతున్నారు. పాదయాత్రలు, ర్యాలీలు, లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్న సమయంలో సమగ్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, మా మద్దతు మీకేనంటూ ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ముక్తకంఠంతో చెబుతున్నారు. పార్టీ వెంటే ఉంటామని, మా సీఎం కేసీఆరే నని, మా ఎమ్మెల్యే మీరేనంటూ నినదిస్తున్నారు. ఇటీవల కాలంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు బోరబండ డివిజన్‌లోని ఎన్ఎన్ఆర్‌పురం హౌసింగ్ సొసైటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఎన్నోఏండ్లుగా క్రమబద్ధీకరణకు నోచుకోని అంశాన్ని జీవో.96ని తీసుకువచ్చి ఇండ్లను క్రమబద్ధీకరించాలని, గత ప్రభుత్వాలు పట్టించుకోని సమస్యను పరిష్కరించారని పేర్కొంటూ సొసైటీ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్‌కే మద్దతు అంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇదే నియోజకవర్గంలో రహ్మత్‌నగర్ హబీబ్‌నగర్ ఫేజ్–1, 2, వినాయక్‌నగర్‌లో ప్లే గ్రౌండ్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించినందుకు కృతజ్ఞతగా మద్దతు ప్రకటించారు. సనత్‌నగర్‌లో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన జెక్ కాలనీ వాసులు, ఇతర డివిజన్ల నుంచి పెద్దఎత్తున వచ్చి మద్దతును ప్రకటించారు. ఆదివారం మంత్రి మల్లారెడ్డికే మా ఓటు అంటూ నాగారం మున్సిపాలిటీ రాంపల్లి 4వ వార్డులో ఏకగ్రీవ తీర్మానాలు చేసి మంత్రికి అందజేశారు. కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానందకు మద్దతుగా గణేశ్‌నగర్, దత్తాత్రేయనగర్, యాదిరెడ్డి బండ, రంగారెడ్డి బండ, మధుసూదన్‌రెడ్డినగర్, శ్రీనివాస్ నగర్ కాలనీ, బాలయ్యనగర్ కాలనీ వాసులు మద్దతు తెలిపారు. ఇతర ఎమ్మెల్యేలకు సైతం ఇదే రీతిలో మద్దతు లభిస్తున్నది.



ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను సన్మానించి మద్దతును ప్రకటించిన బోరబండ ఎన్ఎన్ఆర్‌పురం హౌసింగ్ సొసైటీ సభ్యులు

### అడుగడుగునా బ్రహ్మరథం..

ఎన్నికల ప్రచారంలో దూసువెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్నది. పాదయాత్ర, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సందర్భంగా ఎమ్మెల్యేలకు అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారు. ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ.. సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే సమస్యలకు తక్షణ పరిష్కారంతోపాటు అపరిష్కృత సమస్యలను కొలిక్కి తీసుకువస్తున్నారు. స్థానిక సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల ఆధారంగానే ప్రచార పర్వం సాగుతుండటంతో ఎమ్మెల్యేలకు మద్దతుగా కాలనీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు బ్రహ్మరథం పడుతున్నారు.